నేడు జిల్లాలో 2,65,067 మంది ఫించన్ దారులకు

రూ.112.79కోట్లు పంపిణీ

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం లబ్ధిదారుల ఇంటి వద్దకే ఉ. 7 గంటల నుంచి పంపిణీ చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ కి సంబంధించి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో భాగంగా లబ్ధిదారుల ఇంటి

2 లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 1 ఏప్రిల్, 2025 8 పేజీలు

పేదల ఇళ్లపై పడ్డ రాబందులు

- లోబావి ఎస్టీ కాలనీలో దర్జాగా ఆక్రమణలు
- మరో రాజీవ్‌నగర్‌లా మారిన కాలనీ
- పైసా ఇచ్చి కొట్టేసి దర్జాగా భారీ భవంతులు
- చర్యలు తీసుకోవాలంటున్న బాధితులు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: వారంతా అతి పేద కుటుంబాలకు చెందిన గిరిజనులు.. ఏ పూటకాపూట కూలీ నాలీ చేసి జీవితాలను నెట్టుకొచ్చేవారు.. ఓ పూట కూలికి పోకపోతే ఆ పూట ఆకలితో పస్తులు పడుకునే అతి దీనమైన స్థితి వారిది. ఆ ఉన్న కుటుంబాల్లో సైతం ఎక్కువ మంది చేపల వేటకు వెళ్లి వాటిని విక్రయించి కడుపు నింపుకునే వారే. మిగిలిన వారంతా సమీప ప్రాంతాల్లోని ఇళ్లలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ వారిచ్చే జీతాలతో బతికేవారు. వీరి దీన స్థితి గుర్తించి ఎన్నో ఏళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరికి కాలనీని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం హౌసింగ్‌లో ఇళ్లను సైతం నిర్మించి ఇచ్చింది. అయితే పట్టణం రోజు రోజుకు విస్తరించడంతో అక్రమార్కుల కన్ను వీరిపై పడింది. గత ప్రభుత్వంలో కొందరు నాయకులతో పాటు ఓ బ్యాంకులో పనిచేసే ఓ ఉద్యోగి కుమారుడు రాబందుల్లా ఇక్కడ ఎస్టీలు ఇళ్లపై పడి వీరిని పీక్కుతిన్నారు. వీరి వద్ద బలవంతంగా ఇళ్లను లాగేసుకున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. గిరిజనుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చూసుకుని అధిక వడ్డీలతో డబ్బులు ఇచ్చి, వారు చెల్లించకపోతే ఆ ఇళ్లను స్వాధీనం చేసుకుని అక్కడ వీరు పాగా వేయడం జరిగింది.. ప్రస్తుతం జరుగుతోంది. నిబంధనల ప్రకారం గిరిజనుల ఇళ్లను విక్రయించేందుకు ఎవరికి అధికారం లేదు. కానీ వైకాపా నాయకులు బరితెగించి అవేమీ పట్టించుకోకుండా దర్జాగా ఇళ్లను స్వాధీనం చేసుకుని పెద్ద పెద్ద భవంతులు సైతం నిర్మించేస్తున్నారు.

వందలాది మంది గిరిజనుల ఇళ్లను వైకాపా నాయకులే హస్త గతం చేసుకున్నారంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. శ్రీకాళహస్తి పట్టణంలోని లోబావి వెళ్లే మార్గంలో గిరిజనుల కాలనీ ఉంది. అప్పట్లో గుడారాల్లో చిన్నపాటి గుడిసెల్లో ఉంటున్న వీరి దీన పరిస్థితి గుర్తించి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వీరికి ఓ కాలనీ ఏర్పాటు చేశారు.

2 లో

నేడు పింఛన్ పంపిణీకి

సర్వం సిద్ధం

- లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న ఎన్టీ ఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు నేడు పంపి ణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయా లని సచివాలయ సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచిస్తూ ఏప్రిల్ 1న మంగళవారం

2 లో

గోకులాల షెడ్‌ల బిల్లుల జాప్యం...?!

- జిల్లా వ్యాప్తంగా 16కోట్లు పెండింగ్ - పాడి రైతుల ఎదురుచూపులు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పశుపోషణ, పాడిపరిశ్రమ ను ప్రోత్సహించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గోకులాల షెడ్‌ల నిర్మాణాలుకు పచ్చ జెండా ఊపింది. ఉపాధి హామీ పథ కం ద్వారా నిధులు వెచ్చించింది. నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లిం పుల్లో జాప్యం. పాడిరైతులు ఎదురు చూస్తున్న దుస్థితిపై ప్రత్యేక కథనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి రైతులు శ్రేయస్సు కోరి గోకులాల నిర్మాణాల మంజూరు చేసి ంది. ఇందులో భాగంగా 6 పాడి ఆ వులు కలిగిన రైతుకు 2లక్షల 30వే లు, 4 అవులకు 1 లక్ష 85 వేలు, 2అవులకు 1లక్ష 15వేలు రూపాయిలు చొప్పున నిధులు వెచ్చించి మంజూరు చేసింది. ఈ క్రమంలో జిల్లాలో 2173 గోకులం షెడ్ లు మంజూరు కాగా 2094 షెడ్‌లు నిర్మాణాలు ప్రారంభించారు.కాగా 1393 గోకులం షెడ్‌లు నిర్మాణాలు పూర్తయ్యాయి.వివిధ దశల్లో 701 షెడ్‌లు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఇంకా 79 షెడ్‌లు ప్రారంభానికి నోచుకోలేదు. సుమారు 3 మండలాల్లో పూర్తిస్థాయిలో మంజూరు కాలేదని సమాచారం.ఈక్రమంలో జిల్లా వ్యాప్తంగా 16 కోట్లు నిర్మాణాల కు రైతులకు చెల్లింపులు చెయ్యాల్సివుంది. బిల్లుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.ఇదే విషయమై డ్వామా పిడీ రవికుమార్ వివరణ కోరగా గోకులం షెడ్ల నిర్మాణాల కి సంబంధించి డిసెంబర్ నెల 2024 నుంచి బిల్లులు పెండింగ్ లో ఉన్నమాట వాస్తవమే.ఏప్రిల్ మొదట వారం లో బిల్లులు చెల్లింపులు జరుగుతాయని వివరించారు.

శ్రీకాళహస్తిలో ఘనంగా రంజాన్ వేడుకలు

- భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు
- చరవాణీ ద్వారా ఎమ్మెల్యే బొజ్జల సందేశం
- నాడు గోపాలన్న.. నేడు సుధీరన్న
- అభివృద్ధి ప్రధాతలుగా ముస్లిం సోదరుల కితాబు
- నేడు రూ.50లక్షలతో ఈద్గా అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పెద్దమసీదు, చిన్నమసీదు, కుమారస్వామి తిప్పవీధి తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈదులగుంట ఈద్గా, అయ్యలనాయుడు చెరువులోని ఈద్గాతోపాటు పలు పవిత్ర ప్రదేశాల్లో ముస్లిం సోదరుల ప్రార్థనలు జరిగాయి. ఆయా ప్రార్థనల్లో మతపెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించి అందులోని విషయాలను వెల్లడించారు. అనంతరం ముస్లిం సోదరులు,

2 లో

పేదల ఇళ్లపై పడ్డ రాబందులు

మొదటి పేజీ తరువాయి..

ఇక్కడ కైలాసగిరులన్ని దేవస్థానంకు చెందినవి అయినా దేవస్థానం సైతం వీరి దీన స్థితి చలించి వీరికి కాలనీ నిర్మాణానికి అంగీకరించింది. అప్పటి ప్రభుత్వాలు వీరికి దశల వారిగా ఇళ్లను కేటాయించి నిర్మించి ఇచ్చాయి. పూట గడవటం కష్టంగా ఉన్నా, కూలీనాలి చేసుకుని శాశ్వత నివాసాల్లోనే వీరు నెట్టుకొని వచ్చే వారు. మున్సిపల్ పరిధిలో కాలనీ ఉండటంతో మున్సిపాలిటీ సైతం వీరికి కనీస సౌకర్యాలు కల్పించింది. తాగేందుకు నీటి సౌకర్యంతో పాటు వీధిలైట్లు, కాలువల సౌకర్యం కూడా ఉండటంతో గిరిజనులకు చాలా వరకు కష్టాలు తప్పాయి. దేవస్థానం పరిధి రోజు రోజుకు విస్తరించడంతో పాటు ఇక్కడ శ్రీకాళహస్తీశ్వరాలయం లోబావిని ఎంతో సుందరంగా తీర్చిదిద్దింది. అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు కాలనీకి సమీపంలో గంగాసదన్, కైలాససదన్ మరికొన్ని అతిథిగృహాలను నిర్మించింది. వీటికి సిమెంటు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసి అత్యంత సుందరంగా తయారు చేసింది. దీంతో భక్తుల తాకిడి అధికమైంది. ఆలయానికి వచ్చే భక్తులందరూ దాదాపు ఇక్కడ అతిథిగృహాల్లో బస చేస్తున్నారు. చక్కగా రోడ్లు అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఇక్కడ భూములకు, స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. సమీపంలోనే ప్రైవేటు లాడ్జిలు, అపార్టుమెంట్లు వెలిశాయి. దీంతో అక్రమార్కులకు గిరిజనుల ఇళ్లపై కన్నుపడింది. వీరి ఇళ్లను ఏదో విధంగా కొట్టేయాలనే పక్కా ప్లాన్‌తో గతంలో ప్రభుత్వంలోని కొందరు నాయకులు గిరిజనుల ఆర్థిక అవసరాలను గుర్తించారు. క్రమంగా వారికి డబ్బుల అవసరాన్ని తీర్చుతున్నట్లు నటించి రుణాలు ఇవ్వడం ప్రారంభించారు. తీసుకున్న తర్వాత అధిక వడ్డీలను నెత్తిన రుద్దీ రుణాలు చెల్లిస్తారా చస్తారా అంటూ కూర్చోవడంతో చాలా మంది గిరిజనులు చెల్లింపులు చేయలేకపోయారు. దీంతో ముందు అనుకున్న ప్రకారం ఇళ్లను తాము స్వాధీనం చేసుకుంటామని చెప్పి వారి వద్ద కాగితాల్లో సంతకాలు తీసుకుని ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు గిరిజనులను భయపెట్టి మరీ ఇళ్లను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. వీరి దెబ్బకు ఎంతో మంది గిరిజనులు ఇళ్లను అప్పగించి బయటకు వెళ్లిపోయారు. గత వైకాపా ప్రభుత్వంలో కొందరు నాయకులు ఇందులో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. పట్టణంలో ఓ ప్రముఖ బ్యాంకులో పనిచేస్తున్న ఓ అధికారి తనయుడు ఇదే పనిగా ఇక్కడ స్థలాలను స్వాధీనం చేసుకున్నారని చెబుతున్నారు. ఇతను గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారని చెబుతుంటారు. ఈయనకు అధికారులు సైతం చక్కగా సహకరించారనే విమర్శలున్నాయి. సదరు వ్యక్తి ఏకంగా రోడ్డు మీదకు వచ్చి నిర్మాణం చేపట్టడమే కాకుండా బయట ఎవరికి కనిపించకుండా రేకులను ఏర్పాటు చేసుకుని కొండలో రాళ్లను పగలకొట్టి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తుండటం గమనార్హం. ఇదే విధంగా గత ప్రభుత్వంలో కొందరు గిరిజనుల ఇళ్లను స్వాధీనం చేసుకుని దర్జాగా పెద్ద పెద్ద భవంతులను సైతం నిర్మించి ఇతరులకు అద్దెలకు ఇవ్వడం సొంతంగా నివాసం ఉండటం లాంటివి చేస్తున్నారు. మరికొన్ని ఇళ్లు సైతం నేడో రేపో అక్రమార్కుల పరం కానున్నాయి. ఈ కాలనీ ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇక గిరిజనులే కనిపించకుండా పోయే పరిస్థితి ఉంది. దీనిపై రెవర్యూ అధికారులు కానీ దేవస్థానం అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలున్నాయి. మరో రాజీవ్‌నగర్‌లా మారిన కాలనీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గిరిజనుల కోసం కేటాయించిన స్థలాలను ఎవరూ విక్రయించేందుకు వీలు లేదు. పైగా ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా ఇళ్లను కట్టి ఇవ్వడంతో వీటి క్రయ విక్రయాలకు ఎలాంటి అవకాశం లేదు. ఎన్ని కాగితాలు రాసుకున్నా రికార్డుల్లో మాత్రం గిరిజనుల పేరు ఎప్పటికీ ఉండటం గమనార్హం. ఈ మాత్రం అవగాహన వారికి లేకపోవడం అక్రమార్కులకు ఇదే అవకాశం మారింది. రాజీవ్‌నగర్‌లో ఏ విధంగా ప్రభుత్వం కేటాయించిన ఇళ్లు బయట వ్యక్తుల చేతులు మారాయో అచ్చం అలాగే ఇక్కడ కూడా పదుల సంఖ్యలో ఇళ్లు పరుల చేతులు మారిపోయాయి. పేరు మాత్రం ఒకరిది నివాసం ఉన్న వారు ఒకరు ఇలా తయారైంది ఇక్కడ పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవనగర్‌లో అక్రమాలపై ఉక్కుపాదం మోపింది. గత ప్రభుత్వంలో కొందరు నాయకులు ఇక్కడ ఇళ్లపై పడి బరితెగించి దర్జాగా అక్రమాలకు పాల్పడ్డారు. అక్రమలపై ఉక్కుపాదం మోపుతానంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బొజ్జల సుధీర్‌రెడ్డి రెవెన్యూ అధికారులతో విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రస్తుతం గిరిజన కాలనీలో ఇళ్లపై కూడా విచారణ చేపడితే సగం మంది అనర్హులే గిరిజనుల ఇళ్లను స్వాధీనం చేసుకున్న వారిలో ఉంటారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వెంటనే ఈ విషయంలో చర్యలు తీసుకుని విచారణ చేపట్టి చర్యలు తీసుకుని గిరిజనుల కేటాయించిన ఇళ్లను స్వాధీనం చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తిరిగి గిరిజనులకే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి..

పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ మొత్తాన్ని ఈనెల మార్చి29 శనివారం నాడే సంబంధిత అధికారులు డ్రా చేసి సేఫ్ కస్టడీలో ఉంచుకొన్న మేరకు, ఏప్రిల్ 1వ సిబ్బంది అందరూ ఉదయం 6.30 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేయుటకు పంపిణి ప్రదేశాలకి చేరుకొని పింఛన్లు పంపిణి చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 1న ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ లబ్దిదారులకు ఇంటినుండి ఖచ్చితంగా 300 మీటర్ల పరిధి లోనే ఇవ్వాలని, ఏకారణం చేతనైనా ఇంటివద్ద ఇవ్వడం కుదరక పోతే తగిన కారణాలను యాప్ నందు నమోదు చేయలని తెలియచేసారు. పెన్షన్ దారులు ఏ కారణం చేతనైనా పింఛను తీసుకోలేకపోతే 02 తేదీ వరకు ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,841 మంది ఫించన్ దారులకు సుమారు 111.82 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నామని, మంగళవారం రోజే 100% పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా ఎంపీడీఓ, మునిసిపల్ కమీషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ నెల 1న పెన్షన్ ఇస్తున్న విషయం ప్రతి పెన్షన్ లబ్దిదారునికి వ్యక్తిగతంగా తెలియచేయాలని, పెన్షన్ పంపిణీకి సిబ్బంది ఉదయం 6.30 గంటల లోగా చేరుకుని 7.00 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎక్కడ ఏ ఒక్క పొరపాటు జరగకుండా పంపిణీ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పెన్షన్ పంపిణి చేయు అధికారి పెన్షన్ దారులతో గౌరవంగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడరాదని, ఇంటి వద్దనే ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయవలెనని తెలియజేశారు. ఎవరైనా దీనిని అతిక్రమించితే క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. గత నెలలలో ఏదేని కారణంతో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల పెన్షన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయాలని అన్నారు. కావున ఈ సమాచారం అందరికి తెలియచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మునిసిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫించన్ దారులకు అందరికీ ఐవీఆర్ఎస్ విధానం పై వ్యక్తిగతంగా తెలియచేయాలని అన్నారు.

నేడు జిల్లాలో 2,65,067 మంది ఫించన్ దారులకు రూ. 112.79 కోట్లు పంపిణీ

మొదటి పేజీ తరువాయి..

వద్దనే పెన్షన్ మొత్తాన్ని ఉ 7గంటల నుండి పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 2,65,067 మంది ఫించన్ దారులకు రూ. 112.79 కోట్లు ఏప్రిల్ మాసంలో ఫించన్లు పంపిణీ చేయాలని మంగళవారం 100 శాతం పంపిణీ చేసేలా అందుకు అనుగుణంగా అధికారులు అందరూ చర్యలుతీసుకోవాలన్నారు. అలాగే ఫించన్ పంపిణీకి నిర్దేశించిన సిబ్బంది తప్పకుండా మంగళ వారం ఉ.7 గంటలకు పెన్షన్ల పంపిని ప్రారంభించాలన్నారు. ఫించన్ పంపిణీ దారులకు మొదటి 4 గంటలలోపు పంపిణీ పూర్తిచేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎక్కడా ఏ ఒక్కపొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ పారదర్శకంగా పకడ్బందీగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత నెలలలోవివిధ కారణాలతో ఫించన్ తీసుకొని వారికి ఈ నెలలో మొత్తం ఫించన్ పంపిణీ చేయబడునన్నారు. పింఛన్ పంపిణీ సమయం లో ముందు గా పెన్షన్ లబ్ది దారునికి నమస్కారం చేసి గౌరవంగా పింఛన్ పంపిణీ చేయాలనన్నారు. పెన్షన్ పంపిణీకి కేటాయించిన సిబ్బంది నిర్ణీత సమయానికి ముందు గానే పెన్షన్ పంపిణీ ప్రదేశానికి చేరుకొని నిర్దేశించిన సమయానికల్లా పెన్షన్ పంపిణీ ని ప్రారంభించాలన్నారు .ఎం పి డి ఓ లు, మునిసిపల్ కమిషనర్ లు పగడ్బందీ గా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

శ్రీకాళహస్తిలో ఘనంగా రంజాన్ వేడుకలు

మొదటి పేజీ తరువాయి..

సోదరీమణులు ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. నియోజవకర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రత్యేక సమావేశం ఉండడంతో ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయారు. అందుకు పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చరవాణీ ద్వారా ఎమ్మెల్యే తన సందేశాన్ని వినిపించారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో రంజాన్ మాసం ముగిసిందన్నారు. జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయాగుణం ముస్లీం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపంగా పేర్కొన్నారు. రంజాన్ మాసం ఖురాన్ అవతరణకు చిహ్నంగా భావిస్తారని చెప్పారు. ఈ పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులు, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ మన సమాజంలో ఆశ, సామరస్యం, కరుణ స్ఫూర్తిని పెంపొందించి విజయం కలగాలన్నారు. ప్రేమ, కరుణ, ఐకమత్యం సందేశాలతో సేవాతత్పరత, ఆధ్యాత్మికత వెల్లివిరిసే ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన అల్లా కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని అకాంక్షించారు. శ్రీకాళహస్తిలో బొజ్జల కుటుంబం చేసిన అభివృద్ధి కంటికి కనిపిస్తోందని పలువురు ముస్లీం సోదరులు కొనియాడారు. నాడు ఈదులగుంట, అయ్యలనాయుడు చెరువులో ఈద్గాలకు స్థలాలను కేటాయించి స్వర్గీయ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ముస్లీంల సంక్షేమం కోసం కృషి చేశారని తెలిపారు. తర్వాత ఆయన తనయుడు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆ వారసత్వాన్ని స్వీకరించి ముస్లీంల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్నరని చెప్పారు. గోపాలన్న తర్వాత ముస్లీంల సంక్షేమం ప్రకటనలకే పరిమితమైందే కానీ కంటికి కనిపించ లేదన్నారు. ఇప్పుడు సుధీరన్న రాకతో మళ్లీ పరుగులు పెడుతోందన్నారు. అసెంబ్లీ వేదికగా ముస్లీంల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై స్వరం వినిపించి అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. మాటలతోనే కాక చేతలలో కూడా చూపించిన ఏకైక వ్యక్తిగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నిలిచారని అభినందన జల్లు కురిపించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈదులగుంట ఈద్గాను సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా నూతన నమాజ్ వాల్ ను సాంప్రదాయ ప్రకారం అకర్షనీయంగా నిర్మించారని తెలిపారు. దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఈద్గా అవరణలోని షాదీమహాల్ కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు ఈద్గా అభివృద్ధి పనులను రూ.50లక్షలు వెచ్చించి చేయించారని తెలిపారు. చేయాల్సిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయని ఇఫ్తార్ విందు సందర్భంగా ఎమ్మెల్యే చెప్పడంతో ముస్లీంల సంక్షేమానికి శ్రీకాళహస్తిలో మంచి రోజులు వచ్చాయని అనిపించిందన్నారు. నాడు గోపాలన్న.. నేడు సుధీరన్నలు ముస్లీంలకు అభివృద్ధి ప్రధాతలుగా నిలుస్తున్నారని కొనియాడారు.

భానుడి భగభగలు.. కనిపించని చలివేంద్రాలు

భానుడి ప్రభావంతో దాహంతో అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి పరిధిలో ఎక్కడా ఇప్పటికీ చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తపరుస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదు దారులు మండుటెండల్లోనే గ్రామాల నుండి మండల ప్రధాన కేంద్రానికి రావాల్సిన పరిస్థితి. కార్యాలయం చేరుకొనే లోపే వారు సొమ్మసిల్లి పోయే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రస్థాయిలో ఎండలు ఏప్రిల్ నెల మొదటి రోజులోనే అధికంగా నమోదు అవుతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీలైనంతవరకు ఉదయం 11 గంటల నుంచి నాలుగు దాకా ఎండలో కష్టము చేయొద్దని డాక్టర్లు, నిపుణులు సూచిస్తున్నారు. బగ్గు మంటున్న సూర్యుడి ప్రభావం వలన ప్రజలు ఇబ్బందులకు గురి అవుతారని ప్రజలకు వైద్యులు, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని నీటిని మరియు లవణాలు కలిగిన ద్రవాన్ని మాటిమాటికి శరీరంలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. శరీరంలో డీహైడ్రేషన్ స్థాయి తగ్గిన ఎడల నీరసించి పోవడం, సొమ్మసిల్లి పడిపోవడం వంటివి జరుగుతాయని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఒకవైపు 10వ తరగతి పరీక్షల సమయంలో దూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు దాహానికి తహతహలాడటం జరిగింది. మండల కేంద్రాల్లో, గ్రామాల్లో గాని, ఇప్పటివరకు ఎక్కడ చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు అసహానానికి గురవుతున్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజలు కొరకు, పిల్లల కొరకు చలివేంద్రాలను అక్కడక్కడ ఏర్పాటు చేసి సహాయం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితులలో ప్రజాసేవకు అంకితమైన ప్రజాప్రతినిధులు గాని, అధికార యంత్రాంగం కానీ చలివేంద్రాలను ఏర్పాటు చేసే కార్యక్రమం నెరవేర్చుతారని ఆశాభావంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

దాన దర్మాలకు ప్రతీక రంజాన్ పండుగ

విశాలాంధ్ర-కార్వేటినగరం: ముస్లిం సోదరులు రంజాన్ పండుగను దాన దర్మాలకు ప్రతీకకగా జరుపుకుంటారు. సోమవారం మండల కేంద్రంలోని మసీధులో ముస్లిం సోదరులు చిన్నపెద్ద తేడా లేకుండా నూతన దుస్తువులు దరించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అదే విధంగా పేదలకు దాన ధర్మాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో భాగంగా ఒక్కరినొకరు ఆలింగనం చేసుకుంటా ఈద్ ముబారక్ అంటూ సుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ క్రమంలో భాగంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థన అనంతరం రంజాన్ పండుగ విశేషాలను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ప్రార్థనలు చేయడం వల్ల సుఖసంతోషాలతో జీవించగలరని సూచించారు. ఈ క్రమంలో భాగంగా మసీదున్ను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఉంటున్న ముస్లీం సోదరులు కూడా ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

పంచాంగ శ్రవణ కార్యక్రమం

విశాలాంధ్ర-పూతలపట్టు: స్వయంభు శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం నందు 30-3-2025 ఆదివారం స్వస్తిశ్రీ విశ్వా వసు నామ సంవత్సరం ఉగాది వేడుకలను అత్యం త వైభవంగా నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా శ్రీ స్వామివార్లకు ఉదయం ప్రత్యేక అభిషేకము చందనాలం కారము జరిగినది. తదుపరి ఆలయంలో గల కళ్యాణ వేదిక వద్ద దేవస్థాన అర్చక వేద పండితులు, పురోహితుల సమక్షంలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు పంచాంగ పారాయణం పటించబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, ఎఈవోలు రవీంద్రబాబు, ఎస్ వి కృష్ణారెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్లు కోదండపాణి, రవి, బాలాజీ నాయుడు మరియు ఆలయ సిబ్బంది, ఉభయ దారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఉగాది వేడుకలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం సాయిబాబా ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువ జామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు రవి స్వామి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్ప మాలికలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారి పూజా కార్యక్రమానికి గాజుల నాగేశ్వరరావు, నిర్మల దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఆర్ బాలాజీ, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కమిటీ సభ్యులు చిరంజీవి రెడ్డి పైనే రెడ్డి పలువురు భక్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: చదువుతో పాటు క్రీడల్లో యువకులు రానిస్తే ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత లభిస్తుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ పొన్న యుగంధర్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో తూగుండ్రం పంచాయతీ జనసేన అధ్యక్షుడు రిజ్వానా, నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనారిటి ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ ను సోమవారం పొన్న యుగంధర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారు తున్న కాలానుగుణంగా యువకులు శారీరక దృఢత్వం పటిష్టం పొందా లంటే క్రీడలు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో రెండు రోజుల పాటు 12 టీంలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూగుండ్రం పంచాయతీ టీడీపీ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, మండల టిడిపి మైనార్టీ ప్రధాన కార్యదర్శి అత్తేహర్, మండల జనసేన అధ్యక్షుడు సురేష్ రెడ్డి, మండల జనసేన మహిళ అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో వేడుకగా ఉగాది ఉత్సవాలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం ప్రసిద్ధి రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారు మంగళ వారం ఉగాది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వికవజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు శ్రీ వేణు గోపాలస్వామి మూలవిరాట్ ను పట్టు వస్త్ర. సుగంధ భరిత పుష్ప మాలికలు. విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఉదయం 9:30 నుంచి 10 30 గంటల నడుమ స్వామి వారి ఉత్సవమూర్తులకు వేద పండితులు వేద మంత్రాల నడుమ కనుల పండుగగా పసుపు, చందనం, నారికేలి జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో స్నపన మంజనం చేపట్టారు. అనంతరం నాలుగు గంటలకు వేద పండితులు ఆలయ ఆవరణంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్ల కొలువు తీర్చి ఉగాది ఆస్థానం నిర్వహించారు. అలాగే స్వామివారి ఉత్సవమూర్తులను తిరుచి వాహనంపై ప్రతిష్టించి ఆలయ మాడవీధులలో మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8:30 గంటలకు ఏకాంత సవన్ నిర్వహించి స్వామి వారిని పవసింప చేశారు. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ అధికారి సురేష్ కుమార్, అర్చకులు రమేష్ శబరీష్, గోపాలస్వామి, శరాబ్ బాబు సురేష్, టిటిడి సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

-భక్తి శ్రద్ధలతో ముస్లింలు ప్రార్థనలు.

విశాలాంధ్ర-గూడూరు: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. గూడూరు పట్టణంలోని దుర్గా వీధిలో ఉన్న ఈద్గా వద్ద రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత పెద్దలు రంజాన్ పండుగ విశిష్టతను తెలియ జేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసు కొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసు కున్నారు. పెద్దల సమాధులను సందర్శించి వారిని గుర్తు చేసుకున్నారు. రంజాన్ పండుగను గూడూరు పట్టణంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి ఆనం దంగా జరుపుకున్నారు. అదేవిధంగా గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి, పండుగను జరుపుకున్నారు.

20వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో తహశిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సత్యవేడు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ అధ్యక్షతన సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకత్వంలో ఇంటి స్థలాల పోరాట రిలే నిరాహార దీక్ష 18వ రోజుకు చేరుకుంది. గ్రామంలో ఉమ్మడి కుటుంబాలతో జీవితాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వేరు కాపురంతో ఉండాలంటే ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. కణమనంబేడు రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ లో 252, 253, 254, ఉన్న భూమి ఆక్రమణకు గురైంది. గ్రామంలో ఉన్న నిరుపేదలకు అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గత మూడు నెలలుగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్య వైఖరితో రిలే నిరాహార దీక్షతో సాధించడానికి సమయం ఇదేనన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. అధికారుల స్పందించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అలిపిరి టోల్ గేట్ లో లోపించిన నిఘా వ్యవస్థ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: అలిపిరి టోల్ గేట్ వద్ద హంగామా సృష్టించి తనిఖీలు సిబ్బందికి దొరకకుండా తిరుమలకు చేరుకున్న ముస్లిం వ్యక్తి హజ్రత్ డ్రెస్ తో నెత్తిన ముస్లిం టోపీ ధరించి అలిపిరి టోల్ లో విఐపి లైన్ లో ద్విచక్ర వాహనంపై ఆపకుండా తిరుమలకు దూసుకొచ్చిన ఓ ముస్లిం వ్యక్తి అలిపిరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వినాయక స్వామి ఆలయం వద్ద నిలువరించే ప్రయత్నం చేసిన విజిలెన్స్ గార్డెన్ ను ఢీకొని మరి తిరుమల కు ప్రవేశించిన ముస్లిం వ్యక్తి 18 కిలోమీటర్ల తిరుమల జి ఎన్ సి టోల్ గేట్లో ఎట్టకేలకు సదరు ముస్లిం వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ సిబ్బంది తిరుపతి అలిపిరిలో తనిఖీలు అంతంత మాత్రమేనని రెండు రోజుల ముందు కూడా తిరుమల లో మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేశారు డి ఎం బి రోడ్డు అన్నపూర్ణ హోటల్ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా హెచ్చి కాంప్లెక్స్ నాన్ లోకల్ వ్యక్తులతో స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నామని ఇటువంటి వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు వాపోతున్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇక లేరు

విశాలాంధ్ర-పూతలపట్టు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ హైదరాబాదులోని ఇమేజ్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 6 గంటల 30 నిమిషాలకు స్వర్గస్తులైనారు అనే వార్త విద్యాశాఖకు దిగ్భ్రాంతి కలిగించింది. ఆయన ఆత్మ శాంతించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూతల పట్టణంలో పాఠశాల సిబ్బంది మండల ఉపాధ్యాయులు మరియు పాఠశాల కమిటీ చైర్మన్ నేతాజీ పాల్గొని .ఆయన సేవలను కొనియాడిరి స్నేహ శీలి మృదు శు భాషి వృత్తి పట్ల అంకిత భావము కలిగి మంచి మనిషి అకస్మిక మరణం విద్యాశాఖకు తీరని లోటు అని కొరియాడిరి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది లోకనాథ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, నాదముని, మోహన్ రెడ్డి, రామిరెడ్డి మోహన్, సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యాయులు నాయుడు, గణేష్, సుబ్రహ్మణ్యం, గణపతి, మొదలగు వారు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

ఇటుకల బట్టి కాల్చేసిన దుండగులు

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: ఇటుకల ఫ్యాక్టరీ యజమాని శేషేగౌడు కు చెందిన షెడ్డును అక్కడ ఉన్న వంట చెరుకును ఇద్దరు దుండగులు శుక్రవారం రాత్రి పెట్రోల్ పోసి కాల్చివేశారు. ఈ సన్నివేశాన్ని అక్కడ ఉన్న సీసీ కెమెరాలు రికార్డు చేయడం జరిగింది. సంబంధిత యజమాని శనివారం బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగినది. మండలానికి చెందిన శేషే గౌడ్ తమ ఇటుకల ఫ్యాక్టరీలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతకు పూర్వం కూడా ఈ షెడ్డులోని ట్రాక్టర్ను గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి కాల్చి వేయడం మండల ప్రజలకు తెలిసిన విషయమే. ఈ క్రమంలోనే శు క్రవారం రాత్రి జరిగిన సంఘటన కూడా దీనికి అనుసంధానమే. మండలంలో గత కొన్ని రోజులుగా పాత కక్షల కారణాలతో ఇటువంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి కొన్ని నెలలకు ముందు చెక్‌పోస్ట్ కూడలిలో కొన్ని దుకాణాలను ఇదే క్రమంలో దుండగులు కాల్చి వేయడం తెలిసిన విషయమే, ఈ వ్యక్తులను పట్టుకోవడంలో పోలీసు వారు ఎక్కువ శ్రమించాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే ఇటుకల ఫ్యాక్టరీ యజమాని సీసీ కెమెరాలు అమర్చి ఈ దుండగుల వీడియోలను చిత్రీకరించడం వలన, ఈ కేసును చేదించడం పోలీసు వారికి సులువుగా మారింది. ఈ కేసు పై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.పరుశురాముడు దర్యాప్తు చేస్తున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

విశాలాంధ్ర-రేణిగుంట: రంజాన్ పర్వదినం సందర్భంగా రేణిగుంట పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లాహ్ చూపిన శాంతి, కరుణ, దయ, సేవా మార్గంలో నడుచుకోవాలన్నారు. రంజాన్ పర్వదినం విశిష్టతను, అల్లా గొప్పతనాన్ని కురాన్ పవిత్రత గురించి వివరించారు.

విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి శ్రీ బాలాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కె.రామ్మూర్తి రెడ్డి, కార్యదర్శిగా డి తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షులుగా సి.కుమార్ స్వామి రెడ్డి, పి.కోటిరెడ్డి, కోశాధికారిగా సిమ్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ వై. వెంకట్ర రమణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జి.ప్రభావతి, కే.శంకరయ్య, డి.కేశవరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం రెడ్డి, వై.రామచంద్రారెడ్డి అదేవిధంగా గౌరవాధ్యక్షులుగా జి.సుబ్రహ్మణ్యం రెడ్డిని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనటువంటి కమిటీ విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అందరికీ అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేం దుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తామని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఘనంగా రంజాన్ పండుగ

విశాలాంధ్ర-పుంగనూరు: రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణం లోని అంజుమాన్ కమిటీ సెక్రటరీ ఇబ్రహీం కమిటీ సభ్యులతో కలిసి పట్టణం లో నలుమూలల ముస్లిం సోదరులు నమాజ్ చదు వుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరి గింది. పట్టణంలోని ముస్లిం సోదరులు ఈద్గా మైదానాలకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడం జరిగింది ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పట్టణ ఎస్సై లోకేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాడి పశువులకు పశు భీమా తగ్గింపు

విశాలాంధ్ర-గూడూరు: పాడి పశువులకు పశు భీమా ప్రీమియం తగ్గించారని గూడూరు వెటర్నరీ ఏడి సురేష్ పేర్కొన్నారు. రైతు వాటా ఏప్రిల్ 1వతేది నుండి 15 శాతం, ప్రభుత్వ సబ్సిడీ 85 శాతంగా మార్చడం జరిగింది. అంతకు ముందు 20, 80 శాతంగా ఉండేది. అలాగే ఒక రైతు 10 పశువులకు, 100 గొర్రెలు, మేకలకు, 50 పందులకు భీమా చేసుకోవచ్చు అన్నారు. ఈ తగ్గిన భీమా పథకం ఏప్రిల్ 1 నుండి వర్తిస్తుందని తెలిపారు.

ఘనంగా ఈదుల్ ఫిత్ర్ రమజాన్ పండుగ సంబరాలు

విశాలాంధ్ర-రామకుప్పం: రామకుప్పం ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే ఈదుల్ ఫిత్ర్ రమజాన్ పండుగ సంబరాలను సోమవారం మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించి అల్లా యొక్క అనుగ్రహం కోసం ఐదు రాత్రులు నిద్రాహారాలు మాని జాగారం చేసి ఆదివారం నెల వంక కావడంతో ఉపవాస దీక్షలు విరమించి సోమవారం ఈదుల్ ఫిత్ర్ రమజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని విజలాపురం, కెంచనబళ్ళ, బళ్ళ, ముద్దన పల్లి, పెద్దూరు, లింగాపురం, గొరివి మాకన పల్లి, రాజుపేట, చెల్దిగాని పల్లి, కొంగనపల్లి, తదితర గ్రామాలలోని ముస్లిం కుటుంబాలు కొత్త బట్టలు ధరించి ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మదీనా మరియు మక్కా మసీదులకు చెందిన ముస్లిం సోదరులు అల్లా యొక్క నామస్మరణ చేసుకుంటూ పురవీధుల గుండా జామియా మసీదు వద్దకు చేరుకున్నారు. అనంతరం మూడు మసీదులకు చెందిన ముస్లిం సోదరులు మత పెద్దల ఆధ్వర్యంలో ఈద్గా మైదానానికి చేరుకుని అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు అనంతరం ముస్లిం సోదరులను ఉద్దేశించి మత గురువు ఉమీ మౌల్వీ అక్బర్ సాబ్ పవిత్ర ఖురాన్‌లోని సూక్తులను చదివి వినిపించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం చనిపోయిన తమ పూర్వీకుల సమాధుల వద్దకు చేరుకుని తమ పూర్వీకులకు స్వర్గలోక ప్రాప్తి ప్రసాదించాలని భగవంతుని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్ సాబ్, సైఫుల్లా సాబ్, యహసాన్ (అములు), సనావుల్లా సాబ్, జలీల్ సాబ్, అబ్దుల్ ఖుద్దూస్ సాబ్, హసేన్ సాబ్, తన్వీర్ పాషా, షౌకత్ అలీ, ఇబ్రహీం, రైస్ మిల్ నూర్ అహ్మద్, మరియు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: ఫ్యాప్టో రాష్ట్ర సం ఘం పిలుపు మేరకు 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానము అమలు, పెండింగ్ డిఏ లు విడుదల ఇంకా రాని బకాయి లు విడుదల తదితర సమస్యల సాధనకై బుధవారం సాయంత్రం 3 గంటలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగనున్న నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫ్యాప్టో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కోరుచున్నాము. కావున ఫ్యాప్టో భాగస్వామ్య సం ఘాల బాధ్యులు మీ పరిధిలోని ఉపాధ్యా యులు, కార్యకర్తలను సమీకరించి నిరసన కార్యక్రమంను విజయవంతం చేయవలసి నదిగా ఎస్. సురేష్ ఫ్యాప్టో చైర్మన్, జెడ్డా వెంకటరావు ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

పూతలపట్టులో నూతన ప్రెస్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టులో నూతన ప్రెస్ క్లబ్ ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగినది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి మనీ తెలిపారు. ఆదివారం ఉదయం 11:30 గంటలకు విశ్వ వాసు నామ సంవత్సరము ఉగాది పండుగ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ముఖ్యఅతిథులుగా పూతలపట్టు టిడిపి సీనియర్ నాయకులు పి చంద్రమౌళి నాయుడు గుంటూరు మురళి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు .ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అశోక్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు మురళి మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పార్టీలకు అతీతంగా పనిచేయాలని అన్నారు .అశోక్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై 60 సంవత్సరములుగా పోరాటం చేస్తున్నాము ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజేకు ప్రత్యామ్నాయంగా ఏది ఉండబోదని ఆ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్ కుమార్ స్పష్టం చేశారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలములు ఇప్పించడం పై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి మని, కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షులు హేమ కుమార్ కోశాధికారి శేఖర్ కమిటీ సభ్యులు గురునాథ్ ,ఎమ్మెస్ మనీ, రవీందర్ నాథ్, ఆనంద్, వాసుదేవాచారి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని నూరానీ ఈ మస్జిద్ మరియు జామ మస్జీదుల నుండి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు రంజాన్ ఈద్ సందర్భంగా ఈద్గా మైదానానికి బయలుదేరారు. ఈ సందర్భంగా వారు నల్ల బ్యాడ్జీలను ధరించి వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం "అల్లాహ్ అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహ్ అక్బర్, అల్లాహ్ అక్బర్ వలిల్లా ఇల్హం, అంటూ కలిమా లను పఠిస్తూ మండల వీధుల గుండా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మస్జిదుల ముత్త వల్లి బషీర్ సాహెబ్ మాట్లాడుతూ ముస్లింలకు తాతల కాలం నుండి కష్టార్జితంగా సంపాదించు కున్న ఆస్తులపై ఎవరికి హక్కు లేదని, ఇవి ముస్లింల కష్టార్జితమని, ఈ వక్ఫ్ బోర్డు ఆస్తుల సవరణ బిల్లును రద్దు చేయాలని, చేసే వరకు దీక్షలు చేస్తూనే ఉంటామని ఆయన ఇసందర్భంగా తెలియజేశారు. ముస్లింల సొంత ఆస్తులు లాక్కున్న బాధ లేదు గాని భగవంతుని ఆస్తులుగా భావించే మసీదులు, ఈద్గాలు, వక్ఫోర్డు ఆస్తుల జోలికి వస్తే ఏ ముస్లిం సోదరుడు ఊరికే ఉండదని మండల ముస్లిం సోదరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆప్యాయతతో ఆలింగనం చేసుకొని కబరిస్తాన్ కు బయలుదేరి జియారత్తు చేసుకున్నారు.

యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికే రోబోటిక్స్ కంపెనీతో ఒప్పందం

సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సతీష్

విశాలాంధ్ర-సత్యవేడు: భవిష్యత్తులో విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే రోబోటెక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ చెప్పారు. సోమవారం స్థానిక సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చైర్మన్ ఎన్ ప్రియాంక అధ్యక్షతన రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ 2డి, 3డి, ఏఎల్ రోబోటిక్స్‌తో ప్రతి శుక్రవారం ప్రయోగాత్మకంగా ప్రదర్శన ఉంటుందన్నారు. అయితే మారుతున్న వాతావరణం, పనులకు అనుగుణంగా ఉండే రోబోట్ల అభివృద్ధిలో కూడా ఈ సాంకేతికత ఉపయోగిస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు.ఇందులో భాగంగానే భవనాల మిషనరీ, నిర్మాణ శైలి, సృజనాత్మకత వంటివి పెంపొందించుకునే అవకాశాలు ఉంటున్నారు. రోబోటిక్స్ రీజనల్ మేనేజర్ చరణ్ మాట్లాడుతూ మానవుడు చేయాలని కొన్ని క్లిష్టతర పనులను కూడా రోబోలతో చేయించుకోవచ్చును అన్నారు. ఈ నేపథ్యంలోనే రవాణా సంస్థలకు భద్రత ఏఎల్,డివిల్ లను ఉపయోగించుకోవచ్చునన్నారు. డివిల్ తయారీ అసెంబ్లీ రోబోట్ల పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు చెప్పారు. తదనంతరం రోబోటిక్స్ వాటి పనితీరు వంటి విషయాలపై ప్రయోగాత్మకంగా ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు.అంతకు మునుపు రోబోటెక్ కంపెనీతో సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ దీనిపై ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సన్ రైస్ ప్రిన్సిపాల్ ఆశగోపాల్, ఉపాధ్యాయులు నిర్మల, ఉమ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెంగానమ్మ దేవస్థానంలో లక్ష కుంకుమార్చన..

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానము నందు విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భముగా శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు చందన అలంకారములో భక్తులకు నిజరూప దర్శనభాగ్యం కల్పించుట జరిగినది. శ్రీ అమ్మవారిని శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ కుటుంబ సమేతముగా దర్శించుకొన్నారు. ఈ సందర్భముగా శ్రీ అమ్మవారికి వేద పండితులచే లక్ష కుంకుమార్చన పూజ ఘనముగా నిర్వహించుట జరిగినది. దేవాలయమును విశేష పుష్పాలంకరణ చేయుట జరిగినది. పర్వదిన ఉభయకర్తలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట సుధాకర్ రెడ్డి, మాగుంట సుబ్బరామిరెడ్డి , పుష్పాలంకరణ ఉభయకర్తలు 9000 నెల్లూరు వారు, అన్నదానం కొండేపాటి గంగా ప్రసాద్ శ్రీమతి కోమలి, చందన అలంకరణ ఉభయకర్తలు చెన్నూరి రాంబాబు శ్రీమతి సత్య కుమారి, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్, నెల్లూరు వారు, లక్షార్చన పూజ ద్రవ్యములు టిడిపి నాయకులు బీసీ సెల్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి పెరుమాళ్ళు శ్రీమతి గోవిందమ్మ, ప్రసాద వినియోగము శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి భక్త బృందం వారు వ్యవహరించుట జరిగినది. స్వర్ణ కిరీట, చందనాలంకారణ శోభిత శ్రీ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొన్నారు. భక్తులకు తగినటువంటి ఏర్పాట్లు సహాయ కమీషనరు కార్యనిర్వాహణాధికారి బి. ప్రసన్నలక్ష్మీ పర్యవేక్షణ చేయుట జరిగినది.

సత్యవేడులో ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-సత్యవేడు: మండలంలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం వివిధ మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రార్థన చేశారు. రంజాన్కు నెల రోజులు ముందే ఉపవాసాలు ప్రారంభం అవుతాయి. ఇందులో భాగంగానే మార్చి రెండవ తేదీన ముస్లిం సోదరులు ఉపవాస దీక్షను చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం 6:30 వరకు ఉపవాసం ఉండి అనంతరం మసీదు వెళ్లి ప్రార్థనలు ముగించుకుని కేవలం గంజి పాలు పండ్లు సేవించారు.ఈ క్రమంలో 29 రోజులుగా ఉపవాసం దీక్షతో ఉండి నెలవంక దర్శనం ఆధారంగా భారతదేశంలో మార్చి 31వ రోజున ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) పండుగను జరుపుకున్నారు మండలంలోని దాసుకుప్పం, సిరణంబుదురు, సత్యవేడు,అలిమేలుమంగాపురం తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా కొత్త బట్టలు ధరించి మసీదులలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. కులమతాల బేధాలు లేకుండా వారి స్నేహితులకి విందు ఏర్పాటు చేశారు.ముస్లిం సోదరులకు ఉన్న స్నేహితుల ఇంటికే వారు చేసుకున్న రుచికరమైన పదార్థాలు అందించారు.ముస్లిం సోదరులు లింగ బేధం లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. మసీదులో అల్లాను ప్రార్థించి భక్తిని చాటుకున్నారు.

పోలీసు శాఖ యొక్క మార్చి మాసపు గణాంకాలు

విశాలాంధ్ర-తిరుపతి: జిల్లా వ్యాప్తంగా రాత్రి, పగలు గస్తీ కాస్తూ తనిఖీలు చేసి, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టడంతోపాటు, అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాము. ప్రతి రోజు రాత్రి సమయంలో రోడ్లపై తిరుగుతున్న వ్యక్తులపై స్పెషల్ పార్టీ పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం.జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ విధులలో భాగంగా, నేర నియంత్రణ చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, శాంతిభద్రతల పరిరక్షణ చేయాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసులకు ఇచ్చిన ఆదేశాల మేరకు పగడ్బందీగా అమలు చేయడమైనది.జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ఎన్ఫోర్స్మెంట్ విధులను పెంచి, మార్చినెల రోజులలో సాధించిన ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలు:-ప్రతిరోజు స్పెషల్ పార్టీ పోలీసులతో జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో గస్తీ తిరుగుతూ, రాత్రి సమయంలో రోడ్లపై తిరుగుతున్న 2,966 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ సుమారు 77.05 కేజీల గంజాయిని స్వాధీనం మరియు 8 పోలీస్ స్టేషన్స్లో, 8 కేసులు నమోదు చేయడమైనది. జిల్లాలో ఉన్న 162 మంది రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది.బహిరంగంగా మద్యం సేవించే వారిపై 2,295 మంది పై కేసులు నమోదు చేయడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవించే 143 ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడం జరిగింది. 2,321 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రోడ్లకు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే 1584 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసులను నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు. మోటారు వెహికల్ కేసులకు సంబంధించి ద్విచక్రవాహనాలు, కారులు, ఆటో లపై మొత్తం 1982 కేసులు నమోదు చేసి జరిమానా విధించడమైనది. జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు తమ పరిధిలో గల 4166 సమస్యాత్మక వార్డులు/గ్రామాలను సందర్శించి, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు. అలాగే పల్లె నిద్ర కార్యక్రమాలు 143 గ్రామాల్లో నిర్వహించడ మైనదిసైబర్ క్రైమ్, లోన్ యాప్స్, హెల్మెట్ ధారణ మరియు రహదారి భద్రత నియమాలు, కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారి పైన అయినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లిలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా మండలంలో తూగుండ్రం పంచాయతీ అవలకొండ గ్రామం అజ్హాఖానా జహరాలో ఖురాన్ లోని భక్తి సందేశాన్ని, అదేవిధంగా ఈద్గా వద్ద ఉపవాసం గురించి మతగురువు మౌలానా అబిదాలీ, నబీల్ రజ, మౌలానా మహమ్మద్ కుమేల్ వివరించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు నియాజ్ అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రహమత్ అలీ, షియా ముస్లిం పెద్దలు ఇక్బాల్ హుస్సేన్, జాఫర్ అలీ, షాకిర్, మహదుఅలీ, హషక్ అలీ, బాబు , జాఫర్ అలీ, చాన్ ది అలీ పాల్గొన్నారు.

చిత్తూరులో ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని అన్ని మసీదులను విద్యుత్ దీపాల తో సుందరంగా అలంకరించారు. రంజాన్ సందర్భంగా నగరంలోని గిరింపేట సంతపేట కొండారెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం ముస్లిం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముస్లిం సోదరుల ప్రార్థనల నేపథ్యంలో నగరంలో పలుచోట్ల పోలీసులు వాహన రాకపోకలను దారి మళ్ళించారు. రంజాన్ నేపథ్యంలో నగరంలో సందడి వాతావరణం నెలకొంది.

ఈ-కెవైసీ గడువు పెంపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-చంద్రగిరి: మండల పరిధిలోని రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవారు ఈ-కేవైసీ చేయించుకునే గడువును ప్రభుత్వం ఈనెల 31తో ముగియనుండగా దాన్ని ఏప్రిల్ 30 వరకు పెంచటం జరిగిందని తహసిల్దార్ శివ రామ సుబ్బయ్య పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయనివారు వెంటనే చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోసారి గడువు పెంచే అవకాశం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. కావున ఈ-కెవైసి చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా రంజాన్ పండుగ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : ముస్లిం సోదరులు జరుపుకునే అతి పెద్ద పండుగల్లో రంజాన్ ఒకటి. ఆధ్యాత్మిక పునరుద్ధరణ, హృదయ శుద్ధితో పాటు అల్లాహ్ కృపను పొందే పవిత్రమైన పండుగగా భావిస్తారు. సోమవారం ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు మసీదులో ప్రార్థన చేశారు.ఈ నెలలో ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్షలు పాటిస్తూ, దానధర్మాలు, ప్రార్థనలు నిర్వహిస్తారు. రంజాన్ మాసం ముగిసిన తర్వాత, ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఈ ఏడాది రంజాన్ మాసం మార్చి 2వ తేదీ ఆదివారం ప్రారంభమైంది. నెలవంక దర్శనం ఆధారంగా భారతదేశంలో మార్చి 31వ రోజున ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) పండుగను జరుపుకోనున్నారు. మండలంలోని నీర్పాకోట, పల్లమాల, కాటూరు, పల్ల మాల కండ్రిగ, గాజుల పెళ్లూరు, ఆలత్తూరు, గ్రామాలలోని ముస్లిం సోద రులు రంజాన్ పండుగ సందర్భంగా కొత్త బట్టలు ధరించి మసీదులలో భక్తిశ్రద్ధలు పాటించారు, కుల మతాల బేధాలు లేకుండా వారి స్నేహితులకి విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులకు ఉన్న స్నేహి తుల ఇంటికే వారు చేసుకున్న రుచికరమైన పదా ర్థాలు అందించారు. ముస్లిం సోదరులు లింగ బేధం లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

తిరుపతి రైల్వే కమిటీ సభ్యులుగా హర్షవర్ధన్, వై.ఎస్. బాబు




విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ (ఎన్‌సిసి) సభ్యులుగా జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వై.ఎస్. బాబు నియమితులు అయ్యారు. ఆమేరకు సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్లు డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ధనంజయ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వారు ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు. వీరు స్టేషన్ రైల్వే సేవలు మెరుగుపరడానికి తగిన సూచనలు ఇస్తారు.

ఘనంగా జరిగిన రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి: రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఉదయం తిరుపతి బైరాగి పట్టెడ లోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరియల్ హాల్ నందు ఉపవాసాలు ముగించుకుని చాలా ఘనంగా రంజాన్ ప్రార్థనలు జరుపుకున్నారని ఏఐటియుసి, తిరుపతి టౌన్ అహేలే ఎహదీస్ జమాత్ నాయకులు అల్లాబక్షు తెలిపారు. అల్లాబక్షు మాట్లాడుతూ రంజాన్ పండుగ అంటే స్నేహం, నేనున్నానని గుర్తు చేయడం, నువ్వునావని చెప్పడం అని అన్నారు. ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో నెలరోజులు పాటు కఠిన దీక్షలు ఉంటూ దానధర్మాలు చేశారని, ఎన్నో మంచి పనులు చేసిన మీకు ఈ పవిత్రమైన రంజాన్ మాసంలో మీ జీవితం లో కొత్త వెలుగును పొంది, మీ కుటుంబంలో శాంతి, శ్రేయస్సు తో పాటు ఆయురారోగ్యాలు ను ప్రసాదించాలని మనసారా అల్లాహ్ ను కోరుతున్నానని అన్నారు. ముస్లిం సోదరీ సోదరీమణులు కు ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నగరం లో 800 మందికి బిర్యానీ వితరణ చేశారు. ఈ ప్రార్థనలో తిరుపతి నాయకులు ముబీన్, ఖాలీద్, ఇర్షాద్, ముజమ్మిల్, ముజకీర్, మహబూబ్ బాషా, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లీం సోదరులకు అల్లా దీవెనలు అందాలి

రంజాన్ వేడుకల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

విశాలాంధ్ర-చంద్రగిరి: రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చంద్రగిరి ఈద్గా మైదానంలో సోమవారం జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఇలాంటి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని అన్నారు. నెల రోజుల పాటు ఉపవాసాలు చేపట్టి పవిత్ర మనస్సుతో అల్లాను ధ్యానించడం శుభ పరిణామం అన్నారు. రంజాన్ మాసం పవిత్ర మాసంగా పరిగణించే ముస్లీం సోదరులకు మంచి జరగాలని, ఆకుటుంబాలకు అల్లాదీవెనలు అందాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. అంతకు ముందు ముస్లీం మత గురువుల ఆశీస్సులు తీసుకున్న మోహిత్ రెడ్డి ప్రార్థనలు పూర్తి చేసుకున్న ప్రతి ముస్లీం సోదరునితో కరచాలనం చేస్తూ ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మస్తాన్, జార్ బహార్, మాధవ రెడ్డి, బు లెట్ చంద్రమౌళి రెడ్డి, పాల్గపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కోటీశ్వరరెడ్డి, సిద్దిక్ భాష వైకాపా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడాలి

చిన్ని రాజు పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి జిల్లా సత్తివేడు నియోజకవర్గం లోని వరదయ్యపాలెం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నియోజకవర్గ కమిటీ సమావేశం పి.బాల గురునాథం అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మరియు. పార్టీ ఇన్చార్జ్ ఆంబాకం. చిన్ని రాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతూ ఉందని ఈ సమస్యను పరిష్కారానికి సిపిఐ పార్టీ నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రజలను కలుపుకొని పోరాటాలు నిర్వహించాలని చిన్ని రాజు పిలుపునిచ్చారు రైతులు వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారని పేద ప్రజలు ఇళ్ల స్థలాలు కావాలని అధికారుల ఆఫీసుల చుట్టూ తిరిగి ఆందోళనలకు పూనుకుంటు న్నారని అలాగే రేషన్ కార్డులు అర్హులైన వారికి పెన్షన్లు తదితర సమస్యలతో జనం కొట్టుమిట్టాడుతున్నారని స్వాతంత్రం వచ్చి 73 సంవత్సరాలు దాటిన గ్రామీణ ప్రాంతాల్లో సరైన రహదారులు స్మశానానికి దారులు అనేక మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదని ఆహార భద్రత చట్టాలు తెచ్చిన గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం లేక గర్భవతులు పిల్లలు అనేక రోగాలకు రుగ్మతులకు గురవుతున్నారని ఒకవైపు సంపద పెరుగుతున్న ధనవంతులు మరీ ధనవంతులవుతున్నారు తప్ప సమిష్టిగా ప్రజా సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పార్టీ సమావేశంలో బుచ్చినాయుడు కండ్రిక మండలంలోని కన వనంబీడు దళితులు చేస్తున్నపోరాట ఇళ్ల స్థలాల పోరాటం నిరాహారదీక్షకు సంఘీభావ మద్దతు తెలియజేశారు అలాగే బుచ్చినాయుడు కండ్రిక మండలంలోని విస్సూరం దళితులు చేస్తున్న సాగు భూముల పోరాటనికి సత్యవేడు మండలం అమావాస్య రెడ్డి కండ్రిగ కొత్త మారి కుప్పం గిరిజనులు చేస్తున్న భూ పోరాటాలు జయప్రదం కావాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ముని చంద్ర గిరిజన సంఘం కార్యదర్శి రమణయ్య ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు షణ్ముగం బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నూతన ధ్వజస్తంభం సంప్రోక్షణ

విశాలాంధ్ర-తిరుపతి: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 2 నుండి 4వ తేదీ వరకు నూతన ధ్వజస్తంభం సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఏప్రిల్ 1న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 2న ఉదయం 8 నుండి 11.15 గంటల వరకు వైదిక కార్యక్రమాలు, వాస్తుహోమం, సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు కళాపకర్షణ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3న ఉదయం 8.15 నుండి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభ మహా శాంతి అభిషేకం, పూర్ణాహుతి జరుగనుంది. ఏప్రిల్ 4న ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

ఘనంగా కృష్ణ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి: తెలుగుదేశంపార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 5వ క్లస్టర్ ఇన్ఛార్జి బి.జీ కృష్ణ యాదవ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బి.జీ కృష్ణయాదవ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని సిపిఐ కార్యాలయం ఎదురుగు సందులో ఉన్న మాతృశ్రీ అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే ఒకటవ డివిజన్ తిమ్మినాయుడుపాలెం దగ్గర ఎన్టీఆర్ విగ్రహం దగ్గర పేదలకు అన్నదాన కార్యక్రమం, విష్ణు నివాసం ఎదురుగా ఉన్న కోనేరు దగ్గర అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం స్థానిక బైరాగిపట్టెడ బి.జీ కృష్ణ యాదవ్ ఆఫీస్ దగ్గర కేక్ కటింగ్ నిర్వహించి, పేదలకు నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు లక్షల ఆస్తి నష్టం

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని పుదిపట్ల గ్రామంలో అగ్ని ప్రమాదానికి రెండు లక్షల ఆస్తి నష్టం అయినట్లు బాధితుడు వినోద్ కుమార్ తెలిపారు టమోటా చెట్లు నాటడానికి 10,000 కట్టి తెప్పించాడు. డ్రిప్ పైపులు పివిసి పైపులు వైర్లతో సహా మొత్తం ఖాళీ బూడిదయ్యాయి వివరాల్లోకెళ్తే ఉగాది పండుగ స్మశానాల వద్ద పూజలు నిర్వహించిన వ్యక్తులు కర్పూరం కడ్డీలు అంటించి వదిలేసి వెళ్లారు ఎండలు మండుతున్నాయి గనుక అగ్ని మరింత గాలికి ఎగిసి ఆకులు అంటుకుంటూ స్మశాన వాటికి పక్కలోనే పైపులు టమాటా కట్లు ఉండడంతో అంటుకొని మొత్తం ఖాళీ బూడిదయ్యాయి. బాధితుడు వినోద్ కుమార్ ఇతరుల సహాయంతో మంటలు ఆర్పగలిగారు ఆయన 2 లక్షలు విలువ చేసే సామాగ్రి కాలిపోవడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సమాచారాన్ని స్థానిక అధికారులకు తెలియపరిచారు.

గుమ్మళ్ళదిబ్బ ముస్లిం యువతకు అదానీ తోఫా

విశాలాంధ్ర-చిల్లకూరు: మహమ్మదీయుల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా, ముస్లిం యువతలో క్రీడాసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో అదానీ పోర్టు మరియు అదానీ ఫౌండేషన్ భాధ్యులు రాజేష్ రంజన్ మద్దతు, సహకారంతో గుమ్మళ్ళదిబ్బ ముస్లిం యువ సోదరులకు రంజాన్ తోఫా గా క్రికెట్ కిట్టును సోమవారం అందచేసారు. ఈ కార్యక్రమంలో తమ్మినపట్నం, గుమ్మళ్ళదిబ్బ తెలుగుదేశం ముఖ్య నాయకులు మేకల వెంకయ్య, కొండూరు సురేష్, వైలింగారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-కార్వేటినగరం: అనుమానస్పదంగా వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చింతమండి వద్ద ఉన్న మామిడితోటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... మండలంలోని సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన దాసరి గణేష్ భవననిర్మాణ కాంట్రాక్టర్గా పనులు చేసుకుంటూ జీవనం గడిపేవారు. అయితే సోమవారం సాయంత్రం చింత మండి. సమీపంలో రోడ్డుపై అతని ద్విచక్రవాహనాన్ని ఆపి అక్కడే ఉన్న ఓ మామిడి తోటలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. గుర్తించిన స్థానికులు అతనిని కార్వేటినగరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న స్థానిక సీ.ఐ హనుమంతప్ప ఎస్.ఐ రాజూమార్ సంఘటన స్థలానికి చేరుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేసున్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపిపీలకు ఘనంగా సత్కారం

విశాలాంధ్ర-రామకుప్పం: మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ బిరుగుండ్ల పల్లి గ్రామంలో నూతనంగా ఎంపికైన ఎంపీపీ సులోచన మరియు వైస్ ఎంపీపీ వెంకట్రామే గౌడు లకు రాష్ట్ర గాండ్ల సంఘం సాధికార సభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి ల ఆధ్వర్యంలో సోమవారం దుశ్శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలకు చీరలు మరియు తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, మాజీ ఎఎంసి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు సీతాపతి, మాజీ వైస్ ఎంపీపీ భార్గవి చిన్నకృష్ణ, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చలపతి నందా రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

అన్న కొడుకే కాల యముడు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని ఏ కొత్తకోట పంచాయితీ అంకుతోటపల్లి గ్రామంలో కన్నకొడుకి మనోహర్ రెడ్డి కోడలు సరస్వతికాలయముడై తల్లిదండ్రులను చితకబాది తండ్రికి కాలు చేయి విరిచేసిన సంఘట ఉగాది పండగ ఆనందంతో ఉండవలసిన రోజు తండ్రి పైనే దాడి చేసి సంఘటన గ్రామంలో జీర్ణించుకోలేక గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు చిన్న రెడ్డప్ప రాజమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు కుమార్తెలకు పెల్లి చేసి అత్తారింటికి పంపినారు కుమారుడు వివాహం చేసుకొని అంకుతోటపల్లి గ్రామంలోని నివాసమున్నారు. భార్య సరస్వతి అనారోగ్య కారణం మీ తల్లిదండ్రులు లేనని తల్లిదండ్రులు నాకేమో చేశారని రోజు వేధిస్తూ తల్లిదండ్రులపై దాడి చేయాలని భర్తని రెచ్చగొట్టేది ఇదే క్రమంలో ఇప్పటికే రెండు మూడుసార్లు తల్లిదండ్రులపై దాడి చేశాడు తండ్రి పేరుతో ఉన్న ఆస్తిని కూడా ఓకే ఎకరా 60 సెంట్లు భూమి తన పేరు మీద చేసు కుని తల్లిదండ్రులకు తిండి కూడా పెట్టకుండా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులపై దాడికి పాల్పడుతున్న ప్రస్తుతం చిన్న రెడ్డప్ప తిరుపతి రొయ్య హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నాడు కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేశారు.

25న ఏఎల్‌సిసి సినిమా విడుదలకు సిద్ధం

విశాలాంధ్ర-తిరుపతి : సుమారు కోటి 20 లక్షలతో పూర్తి స్థాయి యువతి యువకుల కథాంశం గా రూపొందించిన ఏ ఎల్ సి సి ఓ యూనివర్సల్ బ్యాచిలర్ తెలుగు చిత్రాన్ని ఏప్రిల్ 25న రెండు తెలుగు రాష్ట్రాలలోనూ విడుదల చేయనున్నామని ఆ సినిమా కథ స్క్రీన్ ప్లే నిర్మాత డైరెక్టర్ లే లీధర్ రావు కోలా తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో సోమవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సుమారు రెండు గంటలు నిడివిగల ఈ చిత్రాన్ని నెల రోజులలో తిరుపతి పరిసర ప్రాంతాలైన తలకోన తూపిలపాలెం రామోజీ ఫిలిం సిటీ తదితర ప్రాంతాలలో నిర్మించడం జరిగింద న్నారు. ఇందులో జేసీ నవీన్ హీరోగా శ్రావణి శెట్టి హీరోయిన్ గా నటించారన్నారు. ఇతర నటీనటులు కూడా తిరుపతికి చెందిన యువకులే కావడం విశేషం అన్నారు. యాంటీ లీడర్ కమిటీ చైర్మన్ ఏఎల్‌సిసి గా సినిమాను నామకరణ చేశామన్నారు. ఒక మగవాని జీవితంలో బ్యాచిలర్ గా ఉన్నప్పుడు జరిగే సంఘటనలు ఆధారంగా చేసుకుని ఈ సినిమాలు నిర్మించడం జరిగిందన్నారు. జ్యోతి యువకులు తమ జీవితంలో లక్ష్యసాధనకై అనేక అవరోధాలను అడ్డుకొని ఎదిరించి తిరిగి తమ గమ్యం చేరే విధంగా ఈ చిత్ర కథ ఉంటుందని తెలిపారు. ఈ చిత్రంలో నాలుగు పాటలు ఉంటాయని వీటిని జస్వంత్ సంగీత దర్శకత్వంలో రూపొందించడం జరిగిందన్నారు. ఇంకా ఈ చిత్రంలో ధనుష్ దేవరపోలి శ్రీకర్ కోమండూరి శ్యామ్ నాయక్ నేత్ర రాజీవ్ కోలార్ రామేశ్వరం శ్రీనివాసుల రెడ్డి కమల్ హరినాథ్ రాజు తదితరులు నటించారన్నారు. సినిమా ఆటోగ్రఫీ ఎస్ చరణ్ తేజ మేకప్ ఆరని కాస్ట్యూమ్స్ రూప దప్పివల్లి ఆర్ట్స్ అజయ్ ఎయిటీన్ నిఖిల్ రాజేష్ కొరియోగ్రఫీ కార్తీక్ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ నాగ శ్రీహర్ష సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మానవాళికి క్రమశిక్షణ, ధర్మాన్ని, దయాగుణాన్ని ప్రబోధించే పండుగ రంజాన్

మాజీ తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: మానవాళికి క్రమశిక్షణ,ధర్మాన్ని, దయాగుణాన్ని ప్రబోధించే పండగ రంజాన్ అని మాజీ తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొనియాడారు. పవిత్ర రంజాన్ పండగను ముస్లింలు తిరుపతి రూరల్ మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. నూతన దుస్తులు ధరించి చిన్నా పెద్దా తేడా లేకుండా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదర, సోదరీమణులకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఈద్ ముబారక్ తెలియజేశారు. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయితీ నాగూర్ కాలనీలోని మసీదులో మాజీ తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంతకు ముందు ముస్లింలు మోహిత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. షాల్, టోపీతో సత్కరించారు. ముస్లిం సోదరులతో పరస్పరం ఆలింగనం చేసుకుని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారికి రంజాన్ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరినీ చేతిలో చేయి వేసి పేరు పేరున ఆత్మీయంగా పలకరించారు.ముస్లింలు కూడా ఆప్యాయతను కనబరిచారు.ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని పెంపొందించే విధంగా రంజాన్ వేడుకల్లో కలిసి మెలసి పాల్గొంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విడుదల మాధవ రెడ్డి, వేముల యశోద, సర్పంచ్ శుభ పద్మనాభ రెడ్డి, కరమల వల్లీ, గూడూరు రఫీ, వేంపల్లి రాజేంద్ర, పి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

42 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ సేవలో తరించా

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్

విశాలాంధ్ర-తిరుపతి: నందమూరి తారకరామారావు అభిమానిగా నారావారి కుటుంబంతో ఉన్న సానిహిత్య సంబంధాలతో గత 42 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో అనేక పదవులలో కొనసాగుతూ సేవలందిస్తున్నానని ఇందుకు గుర్తింపుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు యాదవ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పదవిని ఇచ్చారని ఎందుకు చంద్రబాబునాయుడు కి నారా లోకేష్ కు తెలుగుదేశం పార్టీ అగ్ర నాయకులు అందరికీ ధన్యవాదాలు చెబుతున్నానని యాదవ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ గొల్ల నర్సింగ్ యాదవ్ హర్ష వెలిబుచ్చారు. సోమవారం ఉదయం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వార్డు అధ్యక్ష స్థాయి నుంచి నేడు ఈ స్థాయి వరకు అంచలంచెలుగా రాగలిగినందుకు అందుకు సహకరించిన నందమూరి అభిమానులకు మీడియాకు తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని పేద బడుగు బలహీన యాదవ ప్రజలందరికీ ప్రభుత్వం తరఫున పథకాలను చేరువయ్యేలా కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తిరుమలలో శ్రీవారి తొలి దర్శనం చేసుకునే భాగ్యం కలిగిన యాదవ కులాలకు చెందిన వారిని గుర్తించి వారికి ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారోత్సవం జరగనుందని అందరూ ఈ సన్మాన ప్రమాణ స్వీకార సభకు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే నాలుగో తేదీన తిరుపతిలోని ఎన్టీఆర్ కోడలి నుంచి గాంధీ రోడ్డు గంగమ్మ గుడి మీదుగా చూడక చెప్పి ఆడిటోరియంకు భారీ ర్యాలీ నిర్వహించనున్నామని అనంతరం ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమి రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు ఇతర అగ్ర నాయకులు హాజరుకానున్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు

సామాజిక దృక్పథం కలిగిన అధికారి జగ్గారావు

విశాలాంధ్ర-తిరుపతి: సామాజిక దృక్పథంతో వృత్తి ధర్మాన్ని, సేవా ధర్మాన్ని సమ్మిళితంగా తన జీవితంలో ఆచరించి చూపెట్టిన ఘనత టీటీడీ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ జగ్గారావుకి దక్కిందని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు పేర్కొన్నారు. ఇటీవల జగ్గారావు అకాల మరణం నేపథ్యంలో నగరంలోని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సాంస్కృతిక సంప్రదాయ రంగాల పరిరక్షణే ధ్యేయంగా ఆవిర్భవించిన అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రస్థానంలో గడిచిన నాలుగు దశాబ్దాలుగా జగ్గారావు పాత్ర ఎనలేనిదని గుర్తు చేసుకున్నారు. సంస్థ స్థాపనలో భాగస్వామ్యమై వ్యవస్థాపక సభ్యుడిగా అనేక కార్యక్రమాలను ముందుకు నడిపించడంలో జగ్గారావు కృషి ఎనలేనిదని ప్రశంసించారు. అదేవిధంగా అకాడమీ ప్రముఖులు డాక్టర్ ఆకెళ్ళ విభీషణ శర్మ,ఏపీ నాయుడు, రామచంద్ర నాయుడు, గీతాంజలి తదితరులు మాట్లాడుతూ తితిదే ఉద్యోగిగా ఉంటూనే సామాజిక కార్యక్రమాల నిర్వహణలో జగ్గారావు ఎంతో ఉత్సాహంగా భాగస్వామియై ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జగ్గారావు పాత్ర పాత్రను అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఎప్పటికీ మరిచిపోదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అకాడమీ వ్యవస్థాపక సభ్యులు, కార్యవర్గ సభ్యులు, నగరానికి చెందిన వివిధ సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మునెప్పను ఆదుకోవాలి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం బెల్లం మడుగు గ్రామానికి చెందిన జిల్లా మునెప్ప గురించి తెలియాలంటే కనీసం 25 సంవత్సరాల పూర్వం జరిగినటువంటి ఒక విషయాన్ని తెలుసుకోవాల్సిందే, ఇతను మండలానికి చెందిన దళితుడు పట్టుదల ఉన్న నిజాయితీపరుడు ఆ రోజులలో అంతకు పూర్వం నుండి కూడా మండలంలో దళితుల అణచివేత్త ఎక్కువగా ప్రభావం చూపేది. ఏ విషయాలలోనూ దళితుల మాటలను ప్రక్కన పెట్టేవారు అటువంటి పరిస్థితులలో ఏదో ఒక సమస్యతో పోలీసు స్టేషన్కు వచ్చిన ఇతనిని కులం పేరుతో దూషించి బూతులు తిట్టారనినే నెపంతో అప్పట్లోనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును సంబంధిత అధికారిపై పెట్టి, పట్టువదలని విక్రమార్కుడి వలె 14 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసి చివరికి కేసు ఓడిపోవడం జరిగినది. ఇతను ప్రస్తుతంఆస్తులు పోగొట్టుకొని ఆర్థిక ఇబ్బందులతో మండల పరిసర ప్రాంతాలలో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నెలకు 3000 రూపాయల వృద్ధాప్య పింఛను తప్పించి ఎటువంటి ఆర్థిక ఆదాయాలు లేకుండా జీవనం సాగిస్తున్నారు కాపునాడు అంటారు, కమ్మనాడంటారు, మైనారిటీ లేమో మదరసాలంటారు, మాలనాడు అంటారు, మహానాడు అంటారు ఎక్కువగా మాట్లాడితేనేమో మాదిగ దండోరా అంటారు, ఇందులో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో దళితుడిగా తన జీవితమే ఆదర్శమని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు ఉన్నా డబ్బులేని దళితునికి న్యాయం మాత్రం సున్నా అంటూ జిల్లా మునెప్ప ఒకింత దుఃఖాన్ని వెలిబుచ్చారు. సామాజిక ఆర్థిక న్యాయపరమైన వాటిలో హక్కుని సాధిస్తే తప్ప ముందు అడుగు వేయడం కష్టం అనే విషయాన్ని తెలుసుకొని ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దళితులపై జరుగుతున్న అణచివేతలను అప్పట్లోనే తిరగబడి నిలిచిన జిల్లా మునెప్పను ప్రతి వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తి ఆదర్శంగా తీసుకొని నిజాయితీగా ధైర్యంతో ముందుకు సాగినప్పుడు భావిభారత దళిత సంఘాలకు అర్థం పరమార్థం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న జిల్లా మునెప్పను సహృదయంతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే నాని రంజాన్ శుభాకాంక్షలు

- చంద్రగిరి ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనలు చేసిన పులివర్తి వినీల్
- పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తాం
- త్వరగా షాది మహల్‌ను పూర్తి చేస్తాం

విశాలాంధ్ర-చంద్రగిరి: ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ పండుగ (ఈద్ - ఉల్ - ఫితర్) శుభాకాంక్షలు తెలుపుతూ భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని చంద్ర గిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. సోమవారం ఉదయం చంద్రగిరి ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే పులివర్తి నానికుమారుడు పులివర్తి వినీల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క ముస్లిమ్ సోదరులకురంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదేలాగా సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆయన తెలిపారు. అదేవిధంగా షాది మహల్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. రంజాన్ పండుగ ఈద్-ఉల్-ఫితర్ అన్నది ముస్లిములు జరుపుకునే ముఖ్యమైన పండుగ అని, ఇది ముస్లింలు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు ముగింపు రోజు అని, సఖ్యతకు, త్యాగానికి ప్రతీక అని ముస్లిం సోదర సోదరీమణులు సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని పులివర్తి వినీల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లాఉపాధ్యక్షుడు ఎస్. గౌస్ బాషా, పల్లి నేని సుబ్రహ్మణ్యంనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు వీరంగారి రమేష్ రెడ్డి, ప్రవీణ్ రాయల్, సక్కూరి ధనంజయ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, హుస్సేన్,మహమ్మద్ బాషా, మైనారిటీ ప్రెసిడెంట్ మన్సూర్, మునిరత్నం రాయల్, గురునాథం రెడ్డి, రాజా రాయల్, డిస్ గోపి, వినోద్ రెడ్డి, శంకర్, మన్సూర్, మస్తాన్, కె.కె. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీ శ్వరస్వామిని సోమవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై లోకాభి రాముడు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి శ్రీ కోదండ రామ స్వామి వారి వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు సేవ ప్రారంభమైం ది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ ముఖ్యమైనది. గరుత్మం తుడే శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. దాసుడుగా, సఖుడుగా, వినసకఋగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామస్వామిని వహించి కదిలే తీరు సందర్శనీయమైనది. 108 దివ్య దేశాలలోనూ గరుడ సేవ విశిష్టమైనది. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ముని శంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీ కట్ట పుట్టాల అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ బత్తల చంగల్రాయులు

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడిలో వెలసిన శ్రీ కట్ట పుట్టలమ్మ అమ్మవారిని ఉగాది పర్వదినాన టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బత్తల చంగల్రాయులు, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు నారాయణ ముదిరాజ్, రాష్ట్ర టిడిపి ముదిరాజ్ కన్వీనర్ పి ఎల్ రావు,ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు గొడుగు శంకర్, జిల్లా అధ్యక్షుడు జయరాం ముదిరాజ్,ముదిరాజ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు క్రాంతి ముదిరాజ్ దర్శించుకున్నారు. అతిథులను ఆలయ వంశ పారం పర్య ధర్మకర్తలు కురకాల్వ రామచంద్రయ్య, వాసు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం ఘనంగా సత్కరించి తీర్థప్రసా దాలను అందించారు. ముందుగా ఉగాది సందర్భంగా తెల్లవారు జామున ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వైభవోపేతంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత 50 సంవత్సరా లుగా ప్రతి ఏడాది అమ్మవారి సేవలో పాల్గొంటున్నామని అన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వంశ పారంపర్య ధర్మకర్తలు, అభివృద్ధి కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు త్వరలోనే అందరితో కలిసి సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి నియోజకవర్గానికి అభివృద్ధి చేసేందుకు కష్టపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు కెనరా బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను కెనరా బ్యాంక్ బ్రాంచ్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి సర్కిల్ కార్యాలయం జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మిథంతయ్య మాట్లాడుతూ కెనరా బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ వేడుకలలో పాలు పంచుకోవడం చాలా సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. దేశం ప్రగతి పథంలో నడవడానికి కెనరా బ్యాంక్ ఎల్లవేళలా తన వంతు సేవలను అందిస్తోందని కొనియాడారు. బ్యాంకింగ్ రంగంలో అదునాతనమైన టెక్నాలజీని అందిపుచ్చుకొని ఎప్పటికప్పుడు ప్రజలకు మెరుగైన సేవలందించడంలో కెనరా బ్యాంక్ అగ్రగామిగా కొనసాగుతోందని కితాబిచ్చారు. సామాన్యులకు సైతం బ్యాంకింగ్ సేవలను అందించడంలో కెనరా బ్యాంక్ తనకంటూ ప్రత్యేకమైన ముద్రను వేసుకుందని కొనియాడారు. అంతకుముందు కెనరా బ్యాంక్ వారి పాత ఖాతాదారులను సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.నరసింహమూర్తి, డిప్యూటీ జనరల్ మేనేజర్, తిరుపతి సర్కిల్ కార్యాలయం రవీంద్ర కుమార్ అగర్వాల్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తిరుపతి రీజనల్ ఆఫీస్ టి.నాగరాజారావు, తిరుచానూరు బ్యాంక్ మేనేజర్ వెంకట సందీప్, తదితర బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లీంల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: ముస్లీంల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈద్గా మైదాన సమస్యను సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈద్గా మైదానంలో సోమవారం జరిగిన రంజాన్ ప్రార్థనల్లో ముస్లీం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రార్థనలు అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్య ఖురాన్ అవతరించిన నెల కావడంతో ముస్లీంలకు రంజాన్ నెల ప్రత్యేకమైనదన్నారు. క్రమశిక్షణ, దానగుణం, భక్తి భావన కలయిక రంజాన్ నెలని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇమామ్‌లు, మౌజన్ లకు నెలకు ఐదు వేలు, పదివేల రూపాయులు అందిస్తోందని ఆయన తెలిపారు. అలాగే మసీదుల నిర్వహణ కోసం ఐదు వేల రూపాయలను ఇస్తోందని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం ముస్లీంలను ఓట్ బ్యాంక్ గానే చూసిందని ఆయన ఆరోపించారు. ఈద్గా మైదాన వివాద పరిష్కారానికి తన వంతు కృషి చేయనున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ బిల్లుకు ముస్లీం పెద్దలు సూచించిన సవరణలను ప్రధాని మోది దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల తీసుకెళ్ళే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రాష్ట్ర యాదవ సంఘం కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శులు మబ్బు దేవనారాయణ రెడ్డి, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్య, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సి మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్ కే బాబు, వరికుంట్ల నారాయణ, ఈద్గా కమిటీ చైర్మన్ ఎస్ఎండి రఫీ,మహబూబ్ బాషా, మహేష్ యాదవ్, మునిశేఖర్ రాయల్, జనసేన నాయకులు రాజా రెడ్డి, నైనార్ శ్రీనివాస్, జీవకోన సుధా, బాబ్జీ, ఆర్మాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల భూమిలో మట్టి దొంగలు

పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మారుమూల గ్రామమైన ఆలత్తూరు గ్రామంలో ఏపీఐఐసి భూములలో రాత్రి సమయాల్లో మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా శ్రీనిధి రాజా పరిశ్రమ యాజ మాన్యం ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టి మట్టిని యంత్రాల సాయంతో ఆదివారం తరలిస్తుం టుండగా గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి గ్రామస్తులు అడ్డుకున్నారు వారి సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి సమీపాన ఉన్న శ్రీనిధి రాజా పరిశ్రమ యాజమాన్యం వారు ఏపీఐఐసి భూముల్లోని మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో శనివారం అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా పరిశ్రమలు యాజమాన్యం వారు కమర్షియల్ పనులకు యేదేచ్ఛగా మట్టిని సొమ్ము చేసుకుంటున్నారు. ఏపీఐఐసీ అధికారుల నుంచి రెవెన్యూ అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు పై ఏపీఐఐసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మట్టిని తరలిస్తున్న జెసిపి ట్రాక్టర్లు అడ్డుకొని పరిశ్రమల భూ అధికారులకు అప్పగించారు ఏపీఐఐసి అధికారులు మట్టిని తరలించడం కూడా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.